సజావుగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు

మేడ్చల్ కలెక్టరేట్, మే 24 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు మొదటి రోజు శుక్రవారం సజావుగా జరిగాయి. జిల్లాలోని 89 సెంటర్లలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటిరోజు పరీక్షకు 11,118 మంది హాజరుకాగా 777 గైర్హాజరైనట్లు అధికారులు విలేకరులకు తెలిపారు.

కార్పొరేటర్‌కు వినతి

ఉప్పల్, మే 24 : నాచారం డివిజన్ భవానీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కార్పొరేటర్ సత్కరించారు. అనంతరం కాలనీవాసులు తమ సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రేటర్ నాయకుడు సాయిజెన్ శేఖర్, భవానీనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వై.సత్యనారాయణ, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మల్కాజిగిరి, మే 24: భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ కథనం ప్రకారం... కానాజీగూడ ఇందిరానగర్‌కు చెందిన ప్రమోద్‌కుమార్(36) ప్రైవేటు ఉద్యోగి. అతడికి నాలుగేండ్ల క్రితం సౌజన్యతో వివాహం జరిగింది. అయితే గత కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య కుటుంబ, ఆర్థిక విషయాలపై తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన ప్రమోద్‌కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

విత్తన కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి

● రైతులకు జిల్లా వ్యవసాయాధికారి రేఖామేరీ సూచన

జిల్లా వ్యవసాయ అధికారి రేఖామేరీ

మేడ్చల్ కలెక్టరేట్, మే 24 : వానకాలం సీజన్ మొదలవుతున్నందున రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ అధికారి రేఖామేరీ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అమె విలేకరులతో మాట్లాడారు. విత్తన కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 28 నుంచి ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన అధికృత డీలర్స్ నుంచి, ప్యాకింగ్ మరియు లేబుల్ కలిగిన విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విత్తన పాకెట్లు, బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

మల్లాపూర్, మే 24 : మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ జె. ప్రభుదాస్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఇందిరనగర్ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో డివిజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో దుర్గారెడ్డి, శేఖర్‌గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాలనీల్లో అభివృద్ధి పనుల పూర్తికి కృషి

7వ వార్డులో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ సబితఆంజనేయులుగౌడ్

మేడ్చల్ కలెక్టరేట్, మే 24 : 7వ వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులుగౌడ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ 7వ వార్డు సాయిశుక్ల కాలనీలో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కౌన్సిలర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డులోని ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలతోపాటు ప్రజలకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని సూచించారు.

పేదలకు అండగా ఉంటాం..

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

బాధితుడికి ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, మే 24 : పేదలకు అండగా నిలిచి, వారికి తగిన తోడ్పాటు అందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ రామంతాపూర్ శ్రీరామకాలనీకి చెందిన రమేశ్‌కు వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.45 వేల ఎల్ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించడంతోపాటు, వారి కష్టంలోను భాగస్వామిగా ఉంటానని తెలిపారు. విద్య, వైద్యం కోసం సహాయ, సహకారాలు అందిస్తున్నామని తెలియజేశారు. కాలనీల్లో అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంధం నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

చర్లపల్లి, మే 24: రాష్ట్రం లోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. ఏఎస్‌రావు నగర్ డివిజన్ కమలానగర్‌లోని సీపీఎం కార్యాలయంలో జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టం, ఆవశ్యకతపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య వ్యాపారం నడుస్తున్నదని, ఫీజులను కాలేజీ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా పెంచడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనంతరం సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తిక్, రాథోడ్ సంతోష్, ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద, వివిధ సంఘాల నాయకులు శారద, ఎర్ర ఆశోక్, అన్వర్, సతీశ్, సత్యప్రసాద్, ప్రసాద్, మహేశ్, శ్రీమన్నారాయణ, యాదగిరిరావు, గిరీశ్, శ్రీనివాస్, పంశీ, అవినాశ్, కార్తిక్, మహేశ్వర్, శివ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

శామీర్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, మే 24 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందిస్తున్న వసతులు, డబ్బుల చెల్లింపు విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని, వీలైనంత వరకు ఈ నెల 31 లోపు రైతుల నుంచి పూర్తిగా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ కుమార్, సివిల్‌సప్లై అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్, మే 24 : విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు సంబంధిత అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హబ్సిగూడ సెక్షన్ పరిధిలోని హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 3 నుంచి 7వరకు, కాకతీయనగర్, హబ్సిగూడ ప్రధాన రహదారి ప్రాంతంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. అదేవిధంగా నాచారం ఫీడర్ పరిధిలోని హరిజనబస్తీ, కాకతీయనగర్ పార్కు, హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 1, 2 ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

సీసీఎంబీ ఫీడర్ పరిధిలోని వీఎస్‌టీకాలనీ, భవానినగర్ స్ట్రీట్ నెంబర్ 1 నుంచి 3 వరకు, రాజీవ్‌నగర్, నాచారం పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రామంతాపూర్ ప్రాంతంలో..

రామంతాపూర్ ప్రాంతంలోని ఏడీఆర్ఎం లేన్, శారదనగర్, ఓల్డ్‌రామంతాపూర్, సీడీటీఐ ప్రాంతంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు రామంతాపూర్ ఏఈ రాములు తెలిపారు. వీటితోపాటుగా ప్రగతినగర్‌లో కొంతభాగం, ఇందిరానగర్, మార్కేండయస్వామి టెంపుల్, నెహ్రూనగర్, ఇందిరానగర్‌ప్లాగ్ ప్రాంతంలో మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఉప్పల్ ప్రాంతంలో..

ఉప్పల్‌లోని సత్యనగర్, శాంతినగర్, ట్రైకలర్ అపార్ట్‌మెంట్స్, నల్లపోచమ్మ టెంపుల్ లేన్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా విజయపురికాలనీ, ర్యాంకర్ స్కూల్ లేన్, బాలాజీ వెల్ఫేర్ అసోసియేషన్ రోడ్డు నంబర్ 3, శ్రీకృష్ణ థియేటర్ బ్యాక్‌సైడ్,బాలాజీ నర్సింగ్‌హోం, రఘురామ రెసిడెన్సీ, ద్వారకమయి అపార్ట్‌మెంట్స్ లేన్ ప్రాంతంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

తిమ్మాయిపల్లి, చీర్యాల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

కీసర : కీసర 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాయిపల్లి, చీర్యాల్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈనెల 25న సరఫరా నిలిపివేస్తున్నామని కీసర ఏఈ మురళీకృష్ణ తెలిపారు. తిమ్మాయిపల్లిలోని 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, ధర్మారం, ఫారెస్ట్‌రేంజ్, సైలెంట్‌వార్డ్‌లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నామన్నారు. చీర్యాల్ 11కేవీ ఫీడర్ పరిధిలో యాద్గార్‌పల్లి, చీర్యాల్‌లోని ఎస్ఎల్ఎన్ కాలనీ, చీర్యాల్ గ్రామం, గణేశ్ టౌన్‌షిప్, ఎంఎల్ఆర్ కాలనీ, శ్రీ బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీ, పుష్ప కాలనీ, స్వరూప్‌నగర్, మల్లన్న టెంపుల్, గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల రోడ్, శివసాయి నగర్ రోజ్‌రోడ్, ఎస్సీ కాలనీ తదితర ఏరియాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో

మల్కాజిగిరి : మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని ఎన్ఎండీసీ, కల్యాణ్‌నగర్, అల్వాల్, మచ్చ బొల్లారం, దినకర్‌నగర్, అయ్యప్పనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 నుంచి 12.30గంటల వరకు ఎన్ఎండీసీ స్ట్రీట్ నంబర్ 1,2,3, సిఫీల్‌కాలనీ, కల్యాన్‌నగర్, బ్యాంక్ కాలనీ, తాళ్ల బస్తీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో

అల్వాల్ సర్కిల్ పరిధిలోని దినకర్‌నగర్ స్ట్రీట్ నంబర్ 11.30 నుంచి 12.45 వరకు, 12.45 నుంచి 2.15 గంటల వరకు దినకర్ నగర్ స్ట్రీట్ నంబర్ 1నుంచి 9, జోషినగర్, తిరుమల సిటీ, రాంచంద్రయ్యకాలనీ, మచ్చ బొల్లారం సబ్ స్టేషన్ పరిధిలో ఎంహెచ్ఆర్ కాలనీ, ఎరుకలబస్తీ, ధర్మరెడ్డి కాలనీ, లప్పుగోడాన్స్, ఎంఈఎస్ కాలనీ, ఆశాజ్యోతి కాలనీ, గోపాల్ నగర్ ప్రాంతాల్లో..

మల్కాజిగిరి పరిధిలోని ఏఎస్ఎన్ నగర్ ఫీడర్ 3.00 నుంచి 4.30 గంటల వరకు అనంత సరస్వతి నగర్ స్ట్రీట్ నంబర్ 1,2,3, షిర్డీనగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అదేవిధంగా మల్కాజిగిరి సర్కిల్ బృందావన్‌కాలనీ 11కేవీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.00 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బృందావన్‌కాలనీ, జీకే కాలనీ, ప్రేమ్‌నగర్ కాలనీ, మాతృపురి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సైనిక్‌పురి సబ్‌స్టేషన్ పరిధిలో..

కాప్రా : కాప్రా సైనిక్‌పురి సబ్‌స్టేషన్ 11కేవీ శాలివాహన ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల నరికివేత పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నరేందర్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు శాలివాహన కాలనీ, ఎల్లారెడ్డిగూడ, కాప్రా, తాసీల్దార్ కార్యాలయం, ఎస్‌టీ కాలనీ, కృష్ణానగర్ కాలనీల్లో.. 11కేవీ సాదనావిహార్ ఫీడర్ పరిధిలోని సాదనావిహార్ కాలనీ, సంఘమిత్ర ఎంక్లేవ్, ప్రథమపురి కాలనీల్లో మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11కేవీ ఎల్లారెడ్డిగూడ ఫీడర్ పరిధిలోని వినాయక్‌నగర్, సాకేత్‌రోడ్, హనుమాన్‌నగర్,ఎన్ఆర్ఐ కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, శ్రీచక్ర ఫీడర్ పరిధిలోని ఎస్‌బీఓ కాలనీ, ఓయాటీ కాలనీ, భాస్కర్‌రావునగర్ కాలనీల్లో సాయంత్రం 4 గంటలనుంచి 5.30 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న గది సీజ్

చర్లపల్లి, మే 24: పాఠ్యపుస్తకాలను పాఠశాల పేరుతో ముద్రించి విక్రయిస్తున్నట్లు గుర్తించిన మండల విద్యాధికారులు ఓ స్కూల్‌పై దాడులు నిర్వహించి గదిని సీజ్ చేశారు. ఈ ఘటన కుషాయిగూడలో చోటుచేసుకుంది. కుషాయిగూడలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారని ఏఐవైఎఫ్ నాయకుల ఫిర్యాదుతో విద్యాశాఖ మండల సెక్షన్ అధికారి శేఖర్ స్పందించారు. విచారణ జరిపి విక్రయ గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచి, పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టి నిబంధనలను పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శేఖర్, కిరణ్, సతీశ్ కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 16 తులాల బంగారు, 35తులాల వెండి ఆభరణాలు, రూ. లక్షా నలభై వేల నగదు చోరీ

ఘట్‌కేసర్, మే 24 : తాళం వేసిన ఇండ్లను టార్గెట్‌గా చేసుకుంటున్న దొంగలు పోచారం మున్సిపాలిటీలో భారీ చోరీకి పాల్పడ్డారు. పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ సమీపంలో గురువారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రోడ్డు అన్నోజిగూడ సమీపంలోని నర్సరీ పక్కన బిజిలి తిరుపతి, భార్య సరిత నివాసం ఉంటున్నారు. వారు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లడంతో దుండగులు గమనించి తాళాలను పగులగొట్టి బీరువాలో భద్రపర్చిన 16 తులాల బంగారం, 35 తులాల వెండ ఆభరణాలతో పాటు నగదు రూ. 1,40,000 నగదును అపహరించుకుపోయారు. తిరుపతి, సరిత శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించి పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి క్లూస్‌టీమ్ సాయంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

పలుచోట్ల అక్రమ నిర్మాణాల కూల్చివేత

యాద్గార్‌పల్లిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

కీసర, మే 25 : ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కీసర తాసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని యాద్గార్‌పల్లి సర్వే నంబర్ 51, 53ల్లో ప్రభుత్వ భూమి ఉన్నది. ఆ భూమిలో కొందరు అక్రమార్కులు ప్లాట్లు చేసి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు శుక్రవారం జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయాలు చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, అమ్మినా వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు.

చౌదరిగూడలో..

ఘట్‌కేసర్ : మండలంలోని చౌదరిగూడలో శుక్రవారం రెవెన్యూ అధికారులు పలు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. డీఎల్‌పీఓ సాంబారెడ్డి,పంచాయతీ కార్యదర్శి శశికుమార్,ఎంపీఓ రవి తదితర సిబ్బంది సాయి సురక్ష కాలనీలో 4, వెంకటాద్రి కాలనీలో 3, ఓయూకాలనీలో 1, డాక్టర్స్ కాలనీలో 1 మొత్తం 9 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టడంతో నోటీసులు ఇచ్చి కూల్చివేశామని అన్నారు.

ప్రహరీ కూల్చివేత

మేడ్చల్ రూరల్ : మండలంలోని గౌడవెల్లి గ్రామంలో అక్రమంగా నిర్మించిన వెంచర్ ప్రహరీని అధికారులు కూల్చివేశారు. గ్రామ పరిధిలోని సర్వేనెంబర్లు 615, 620, 642 తదితర వాటిల్లో ఏర్పాటు ఐకాన్ (విష్ణు తేజ) వెంచర్‌కు ప్రహరీగోడను ఏర్పాటు చేశారు. కాగా ఈ ప్రహరీని అక్రమంగా నిర్మించినట్లు గుర్తించిన ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం గ్రామకార్యదర్శి శాంతకుమారి జేసీబీతో కూల్చివేయించారు.

శామీర్‌పేట పరిధిలో...

శామీర్‌పేట : ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మండలంలోని శామీర్‌పేట, బొమ్మరాశిపేట గ్రామాల్లో పలు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారు. శామీర్‌పేట గ్రామ రెవెన్యూ పరిధిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలపై విచారణ జరిపి డీపీవో ఆదేశాల మేరకు ఆ రోడ్డు ప్రహరీని కూల్చివేశారు. అదేవిధంగా బొమ్మరాశిపేట చెరువులో కొందరు అక్రమంగా ఎఫ్‌టీఎల్‌లో మట్టి నింపి ఆక్రమణకు పాల్పడుతున్నారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎఫ్‌టీఎల్ పరిధిలోని తాత్కాలిక ప్రహరీని కూల్చివేసినట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సాంబిరెడ్డి, ఎంపీవో సునీత, ఆర్ఐ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

బొమ్మరాశిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఏర్పాటు చేసిన జేసీబీ సాయంతో ప్రహరీ గోడలను తొలగిస్తున్న అధికారులు

వరుస చోరీలు.. బెంబేలెత్తుతున్న ప్రజయ్ వాసులు

● మూడు రోజుల్లో దాదాపు 40 తులాల బంగారం, రూ. 2 లక్షల నగదు చోరీ

మజీద్‌పూర్ ప్రజయ్ హోమ్స్‌లో చోరీ జరిగిన ఇల్లు

శామీర్‌పేట, మే 24 : వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఒకే కాలనీలో వరుసగా మూడు చోరీలు జరిగిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు... మజీద్‌పూర్ గ్రామ పరిధిలోని ప్రజయ్ హోమ్స్‌లో నివాసం ఉంటున్న అనిల్‌కుమార్‌యాదవ్ కుటుంబ సమేతంగా ఊరికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు తాళం పగులగొట్టి బంగారు నెక్లెస్, లాంగ్ చైన్, నాలుగు గొలుసులు, కమ్మలు బుట్టలతోసహా 12 తులాల బంగారం, అర కిలో వెండితో పాటు రూ. 65 వేలు అపహరించుకుపోయారు. ఇదిలా ఉండగా మరుసటి రోజు అదేకాలనీలో శ్రీనివాస్‌నాయుడు ఇంట్లో 30 తులాల బంగారం, కిలో కుపైగా వెండి రూ.92 వేల నగదు, కింది ఇంట్లో నివాసం ఉంటున్న షఫి ఇంట్లో రూ.50 వేల నగదు, సెల్‌ఫోన్‌ను దొంగలించారు. బాధితులు శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్‌టీమ్స్, డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు.

కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి

మేడ్చల్ రూరల్, మే 24: మండలంలోని సైదోనిగడ్డ తండాలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి కాపాడాలని లంబాడ సంక్షేమ సమితి ఫౌండేషన్ చైర్మన్ ధనరాజ్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని రావల్‌కోల్ గ్రామపంచాయతీకి అనుబంధంగా ఉన్న సైదోనిగడ్డ తండా ఐదేండ్ల క్రితం నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. ఆ సమయంలో గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 747, 748లోని 3.33 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని తండాకు కేటాయించారని తెలిపాడు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై తాసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, కలెక్ట